# బాలప్రభ

## భక్తుని కానుక

కలువకొలను సదానంద

శ్రీ శంకరాచార్యులవారు ఒకసారి దైవదర్శనం కోసం ఒక శివాలయం లోకి వెళ్ళారు. ఆగుడిలో ఈశ్వరుని పటం ఒకటి అతని దృష్టిని ఆకర్షించింది. ఆపటంవైపు కొంత సేపు తదేకంగా చూచి వెర్రివాడులా బిగ్గరగా నవ్వాడు శంకరాచార్యుడు.

ఆ పటంలో శివునిరూప చిత్రణ ఎలా ఉంచంటే—మొలకు జింక తోలు. శరీరమంతా విబూదిరేకలు, మెడచుట్టూ నాగేంద్రుడు, ఒక చేతిలో త్రిశూలం, మరొక చేతిలో కపాలం. ఆదిభిక్షువు రూపం అది.

భక్తి పారవశ్యంతో ఒడలు మరిచాడు శంకరుడు. అతిడు పరమేశ్వరుని యిలా స్తుతించడం మొదలెట్టాడు: "మహాదేవా! నీవు ప్రాణులకు జీవనాధారుడవని, భక్తుల పాలిట కల్పతరువని ఎంచి. నీవద్ద వరాలు పొందాలన్న కోరికతో వచ్చాను. కానీ, నీవద్ద ఏముంది నాకివ్వడానికి? కట్టుకోవడానికి బట్ట లేక జింకతోలు కప్పుకున్నావు. ధరించడానికి ఆభరణాలు లేక, పామును మెడకు చుట్టుకున్నావు. పూసుకోవడానికి చందనం లేక ఒళ్ళంతా బూడిద రాసుకున్నావు. నూనెలేక నీ శిరోజాలు జడలు గట్టుకు పోయాయి. భిక్షపాత్ర చేత బట్టుకొని బిచ్చమెత్తుకుంటున్నావు. అదైనా మంచిపాత్ర దొరకలేదా నీకు? పుర్రె చేతబట్టుకున్నావే? అయ్యో! బిచ్చమెత్తి పొట్టబోసు కునే నిన్ను నేనేమని యాచించను? పోనీలే. నేనే నీకు భిక్షవేస్తాను. నీ వేషం వుంది చూశావూ — చాలా తమాషాగావుంది. అయినా యిలా వెళ్తే నీకు భిక్ష మెవరు వేస్తారు? నామాట విను. నీ వేషానికి తోడు కోతి నొకదాన్ని కట్టేసుకుని వెంట బెట్టుకు వెళ్ళు చూచేవాళ్ళకు వినోదానికి లోటుండదు; నీకు భిక్షానికీ లోటుండదు!"

ఈ మాటలు వింటున్న అతని శిష్యులు మరికొందరు భక్తులు విస్మయంతో నిలబడిపోయారు. శంకరాచార్యుని వంటి మహాభక్తుడా భగవంతుని గేలిచేస్తూ కించపరుస్తున్నాడు? ఇతనికేమన్నా పిచ్చి పట్టిందా? అనుకున్నారు.

శంకరాచార్యులు మాత్రం తన్మయత్వంతో యిలా చెప్పుకుపోతు న్నాడు: "భక్తజనావనా! 'కోతిని నేనెక్కడ సంపాదించను' అంటావేమో? నీకాచింతవద్దు. నా దగ్గర ఒక కోతివుంది. అది ఒక్క క్షణమైనా ఒకచోట నిశ్చలంగా వుండనంటుంది. దాన్ని అదుపులో పెట్టుకోవడం చాల యిబ్బందిగానే వుంది. శంకరా! నా మనస్సు అనే ఈ కోతి నాదగ్గరెందుకు? తాడువేసి కట్టుకుని దీన్ని నీతోబాటు తీసుకుపో!"

ఈ మాటలు విన్న భక్తుల ముఖాలు పద్మదళాల్లా విచ్చుకున్నాయి.

దూషణ, భూషణ అనేవి వ్యతిరేకపదాలు. అయినా, భక్తుల విషయంలోమాత్రం భగవంతునిపట్ల—దూషణలైనా అవి భూషణలే! ★

## మీకు తెలుసా?

1. మొదటి ఎలిజబెత్ రాణి పేరిట అమెరికా సంయుక్త రాష్ట్రాలలో (యు. ఎస్. ఎ) ఏర్పడిన రాష్ట్రం ఏది?

2. యాల్టా సమావేశంలో పాల్గొన్న మూడు అగ్రరాజ్యాల అధినేతలు ఎవరు?

3. ప్రపంచంలో ఎన్ని రకాల ఏనుగులు కలవు?

4. 'లాగరిథమ్' కనుగొన్న గణిత శాస్త్రజ్ఞుడు ఎవరు?

5 'ఆర్టిఫిషల్ హొరైజన్' అంటే ఏమిటి?

6. 'ఫాదమ్' అంటే ఎంత లోతు?

7 బాలభటుల సంస్థ (బోయ్ స్కౌట్ ఆర్గనైజేషన్) స్థాపించిన వారు ఎవరు?

8. బ్రిటన్‌లో పెట్రోల్ పంపులు మొదట స్థాపించినది ఎప్పుడు?

(జవాబులు 53 వ పేజీలో)